# జీవన గమ్యం

— చోడా కోటేశ్వరరావు

మంచీ - చెడూ, ఈ రెండింటి గూర్చిన తాత్త్విక చర్చ సాహిత్యంలో చాల సాగింది ఈ రెండింటి గురించి అనేక విధాలయిన అభిప్రాయాలూ వున్నాయి. మంచీ - చెడూ, యివి స్థిరములా, లేక పరిణామగతిలో తమ తమ స్థానాల్ని మార్చుకుంటాయా? ధర్మ శాస్త్రాలలోనూ, ఇతర మత విషయికమైన పౌరాణిక గ్రంథాలలోనూ మంచీ - చెడూ స్థిరములనే అభిప్రాయం వెల్లడవుతూంది, కాని నీతి విషయకమైన సాహిత్యం మాత్రం యిందుకు కొంత భిన్నంగా పరిస్థితుల్నిబట్టి వ్యక్తుల మానసిక స్థితినిబట్టి యివి తమ తమ స్థానాల్ని మార్చుకుంటాయని స్ఫురింపజేస్తుంది. దీనికి కారణం ఒక్కొక్కటే ఏవో కొన్ని ఆదర్శాలు పెట్టుకుంటారు. అవే మంచివని వాటికి విరుద్ధమైనవి చెడ్డవని అనుకుంటారు వాటిని బ్రతుకులో వెతుక్కుంటారు. అవి కనబడవు. కనిపించినవాటినే వేటికో సమన్వయింపజూస్తారు. అవి సరిగా అతకవు. పప్పులో కాలువేసి తమ అశక్తతను, అజ్ఞతను ఒప్పుకొనేపాటి గుండె నిబ్బరంలేక ఆదర్శాలమీది వ్యామోహంతో జీవితగతిని నిరసించి తూలనాడతారు ఆ జీవితపు సొంతదారులు సమాజంమీద విస్తారమైన ప్రభావం గల్గిన ఆ ఆదర్శాల తాలూకు సిద్ధాంతాలను యేమీ అనలేరు. వాటిని వల్లించేవారినీ పల్లెత్తుమాట అనలేరు కాని జీవితగతిలోనుంచే జీవన తత్త్వాన్ని వివేచించుకుంటే ఈ యిబ్బంది చాలవరకు తొలగిపోతుంది, జీవితం గురించి మరింత వాస్తవమైన పరిజ్ఞానం మనకు లభిస్తుంది. కొంతవరకైనా కొన్ని జీవితాలు మానవతా స్ఫోరకమైన సానుభూతికి పాత్రమవుతాయి. మరికొంత సంస్కారయుతమైన దృక్పథం మనిషికి అలవడుతుంది. రవి- సంధ్య వారి దాంపత్యాన్ని హేతువాదంతో పరిశీలించిన పిమ్మట "సంధ్య తన ప్రేమపథమునుండిచ్యుతయై ఆదర్శహీనమైన జీవితం గడుపుతోంది" అన్నభావం ఎంతమాత్రం నిజం కాదేమో ననిపిస్తోంది.

* * *

సూత్రధారణ అయిపోయింది ఇరు పక్షాల పెళ్ళివారూ "అమ్మయ్య" అని పై కండువాలు తీసి ఒకసారి విదిలించారు. ముత్తైదువలు ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయినట్లు తృప్తిగా గాలి పీల్చారు. పెళ్ళికళముందు విద్యుద్దీపాలు వెల వెల బోయినవి. పెళ్ళికొడుకు ముఖంగూడా వెల వెల బోయినట్లు లీలగా గమనించిన రామారావు తనంతకు ముందునుంచీ అలుకుంటున్న భావాల్ని స్ఫుటం చేసుకున్నట్లు బరువుగా వూపిరి తీసుకున్నాడు. కాని యిదంతా వివాహ సంరంభంలో త్రోసుకుని పోయింది యథా విధిగా మిగతా తతంగం పూర్తయింది.

ప్రచురణకు స్వీకరించిన
పోటీ కథానిక

ముందె జరిగిపోయిన నిర్ణయం ప్రకారం మరునాడు పునస్సంధానం ఏర్పాటు చేయబడింది. పాన్పుమీద కూర్చున్న సంధ్య ముత్తైదువల ముచ్చట్లు తృప్తిగా తీర్చలేదు. "కొత్తలో సిగ్గు కదన్లే" అని సరిపుచ్చుకున్నారు. ముహూర్తవేళకి సంధ్యని గదిలోకి పంపి బైట గొళ్ళెం బిగించారు. "కార్యప్పెళ్ళి కొడుకు పందిరి మంచంమీద పడుకుని ఏవేవో కలలు కంటున్నాడు" అనుకున్నారు ముత్తైదువులంతా. దగ్గరగా అతని ముఖకవళికలు పరిశీలిస్తే అతను కలలు కనడంలేదన్నీ చెదరిపోయిన తన కలల్ని తిరిగి ఒక క్రమపద్ధతిలో పెట్టడానికి తంటాలు పడుతున్నాడనీ గ్రహించవచ్చు. బయట ఆడవాళ్ళ గల గల నవ్విన నవ్వుకి రవి మనస్సు మళ్ళీ కార్యం గదిలోకి వచ్చి పడింది. ఇలా ఓరగా చూసేసరికి తలుపు దగ్గరగా సంధ్య నేల చూపులు చూస్తూ నిలబడి వుంది కాస్సేపు చూపు త్రిప్పుకోలేకపోయాడు. తన వూహాలకి సరిపోయిన రూపు. శోభనపు అలంకరణలో ఆమె అందం తన వూహాకే మించిపోయింది. స్వాభావికమైన కామన అతని ఆలోచనల్ని జోకొట్టింది "అన్నే యిదంతా వధూ సహజమైన లజ్జ, బిడియమేమో! నేను పొరబడ్డానేమో" అనుకున్నాడు రవి. కొంచెం వేచి చూసి, లేచి సంధ్య చేతిని తన చేతిలోకి తీసుకొన్నాడు. పాము స్పర్శ తగిలినట్లుగా సంధ్య నిలువెల్లా జలదరించిపోయింది ఆమె గడ్డాన్ని మునివ్రేళ్ళతో పైకెత్తాడు రవి. ఆమె పెదాల బిగింపులో అసహనం. ముఖంలో అననుకూలత. కళ్ళలో నిస్సహాయత, దీనత యింకా.... నన్ను వదలిపెట్టండి అని ప్రార్థన. ఈ భావాలన్నింటిని ప్రోదిచేసి మాటల్లోకి మార్చుకొని వ్రాసుకుంటే "దయచేసి నన్ను ముట్టుకోవద్దని వేడుకుంటున్నాను" అని ఏర్పడుతుంది. సంధ్యచేతిని వదలివేసి తిరిగి పాన్పుమీదికివెళ్ళి పడుకున్నాడు. "తాను యీ రెండు రోజులనుండి వూహించింది యదార్థమేనేమో! ఈ అసహజమైన స్థితిలో తన సహజమైన వుద్రిక్తత మరొక వ్యక్తి వ్యథకి, బాధకి కారణమైతే? కార్యపు గదిలో యిలాంటి వూహాలు రావడం అసహజమూ, అనుచితమూ అవుతుందా? అసహజమూ, అనుచితమూ అని తన సంస్కారాన్ని గంగలో త్రోసి మూర్ఖునిలా ప్రవర్తించ వచ్చా? అలా చేసినా తన

నెవరూ యేమీ అనలేరు. వేలెత్తి చూప లేదు. కొంతమంది "శెబాష్!" అని మెచ్చుకోవచ్చు గూడా. అయితే తాను చేసేదీ, చేయవలసిందీ, అంతా స్వోత్కర్షని నిరూపించుకోవడానికి యితరుల మెప్పు పొందడం కోసమూనా! ఇంతకిమించి మనంచేసే పనికి ప్రయోజనమేమీ లేదా? బలవంతంగా స్త్రీని అనుభవించితే కలిగేది నిజమైన తృప్తా? లేక పైశాచిక ఉన్మత్తత శాంతించడమా? పెళ్ళిపీటలమీద "నాతి చరామి" అని ప్రమాణం చేయించారే! బ్రతుకు గతిలో దీనికేమీ విలువ నివ్వ నక్కరలేదా? నేను కట్టుకున్నవన్నీ గాలి మేడలా???" సమాధానం లభించని యిలాంటి ప్రశ్నలు తరుముతూవుంటే నిరాధారమైన శూన్యంలో పల్టీలు కొడుతున్న రవి చాలాసేపటికి కళ్ళు తెరచి చూశాడు. సంధ్య ఇంకా అక్కడే నిలబడి వుంది. "సంధ్య - రవి" యీ రెండు పేర్లూ ప్రక్క ప్రక్కనే చూసి తానెంత మురిసిపోయాడు. తమ దాంపత్యం ఎంతో సహజంగా, సుందరంగా వుంటుందని ఆశించాడు. కాని అలా కాలేదు, తన ఆశల్ని మంటగల్పిన వ్యక్తినిఎదురుగా చూస్తుంటే అతనికి వళ్ళుమండిపోయింది. కాని తమాయించుకున్నాడు. "ఈ స్థితికి సంధ్య ఎంతవరకు బాధ్యురాలు? బలవంతపు వివాహమా? ఏమైనా యిప్పుడు చేయగల్గిందేమీ లేదు. వేచి చూడవలసిందే" ననుకున్నాడు రవి.

"సంధ్యా! అలా ఎంతసేపు నిలబడతావ్!"

నేలమీదనుంచి చూపులు మళ్ళించలేదు సంధ్య.

"ఒంట్లో బాగాలేదా!" బాగానే వుందని తనకి తెలుసు. అయినా అంతకిమించి అడగడానికేమీ తోచలేదు."

బాగానే వుందని తల త్రిప్పింది సంధ్య.

మంచందిగి సంధ్య దగ్గరగా వెళ్ళాడు రవి.

"నీకు బాధ కల్గించదలచుకోలేదు.... నిర్భయంగా వుండొచ్చు. అలా వణికి పోవలసిన అవసరమేమీలేదు."

"మీరు పడుకోండి. నే నిక్కడ క్రింద పడుకుంటాను."

"చూడు సంధ్యా! వివాహంచేత బంధింపబడిన వాళ్ళం మనం, ఈ బంధం నుండి విడిపోవడం సులభంగాదు మనకి. వైవాహిక ధర్మం నెరవేరుస్తున్నామా లేదా అన్నది మన యిద్దరికి సంబంధించిన వ్యక్తిగత విషయం. కాని బయటి ప్రపంచానికి మనం దంపతులంగానే కనిపించాలి, లేదా మనల్ని దుయ్యబడతారు. బాధ యిద్దరికీ సమానమే అయినా ప్రస్తుత సాంఘిక పరిస్థితినిబట్టి విమర్శలకి ఎక్కువగా గురిఅయ్యేది నువ్వు. ఇది నిమ్న సంప్రదాయం, కుటుంబగౌరవం నీ ఆర్థిక స్థితి మొదలైనవాటిని చూపి బెదరించడం గాదు, నా కోసం ఒక స్త్రీ జీవితం బజారు పాలు చేయడంగాని, లేక నా సుఖంకోసం అనుకూల భావంలేని ఒక ఆడదాన్ని కౌగిట్లో నలిపి వేయడం యిష్టంలేకనే. విడిగా పడుకోవడమే నీ అభీష్టమైతే అందుకు నేనేమీ అభ్యంతరం పెట్టను. కాని యిదెవరన్నా గమనిస్తే నీ బ్రతుకు అభాసుపాలవుతుంది. చదువుకున్న దానివి. పరిస్థితిని అర్థంచేసుకోగలవనుకుంటాను."

సంధ్యనుంచి సమాధానంలేదు.

"సరే" అంటూ దిండు బెడ్‌షీటు తీసి ఒక ప్రక్కగా వుంచి తాను పడుకున్నాడు రవి.

మంచంమీదనుంచిదిండు బెడ్ షీటు తీసికొని క్రిందనే పడుకుంది సంధ్య విడిగా. విడివిడిగా పడుకున్న శోభన వధూవరులు వేరే వేరే ఆలోచనలతో వేగిపోయారు తెల్లవార్లూ.

మరురోజుగూడా సంధ్య భయపడుతూనే లోపలికి వచ్చింది. ఆమె ముఖంలో కళాకాంతులు తప్పిపోయినవి.

"ఇంకా నామీద నమ్మకం కలుగలేదా? భయం పోలేదా?" అన్నాడు రవి.

"అది గాదు. ఎలా తెలిసిందో యేమో. పిన్ని వాళ్ళు కోప్పడ్డారు."

"అయితే నే వెళ్ళి క్రిందపడుకునేదా యివ్వాళ?"

"అంత అపార్థం చేసుకోవలసిందేమీ లేదిందులో"

రవి మరో వైపు తిరిగి పడుకున్నాడు సంధ్య మంచం పట్టిమీదనే చోటు చేసుకుంది.

మరునాడు రామారావు దగ్గరనుండి టెలిగ్రాం వచ్చింది. "సెలవు పొడిగింపు మంజూరు కాలేదని. వెంటనే బయలుదేరి రమ్మనీనూ" టెలిగ్రాం చూసుకుని తన వూరెళ్ళిపోయాడు రవి. టెలిగ్రాంలో వున్న కిటుకు రవికి, రామారావుకి తప్ప మరెవ్వరికీ తెలియదు.

రవి నోటివెంట సంగతంతా విన్న రామారావు అతణ్ణి అనునయిస్తూ, "ఆమె హృదయాన్ని అర్థంచేసుకొనేందుకు మరి కొంత వ్యవధి అవసరం. మన చేతిలోని పనిగదా అని త్వరపడి నిర్ణయం తీసుకుంటే తరువాత విచారించవలసిరావచ్చు. మరి కొంతకాలం వేచి చూడడం ఉభయులకు మంచిది. చూస్తూ చూస్తూ ఏ స్త్రీగూడా తన కాపురాన్ని కాలదన్నుకోదు. నేను ఆరా తీసినంతవరకు సంధ్య చాల గుణవంతురాలని తెలిసింది. నీవు వుద్రేకంతో ఆమె మనస్సుని కలచి పాడుచేస్తే ఆశించిన ఫలితంరాదు సరిగగా కాగల కార్యం సైతం చెడిపోవచ్చు. కొంతకాలంపాటు నిర్నిమిత్తంగా వుంటే మునిగిపోయేమీ లేదు.... అని అన్నాడు. రవి విశ్చలంగా విన్నాడు.

నాలుగునెలలతర్వాత సంధ్యను కాపురానికి పంపారు. రవి ఆమెలో తాను యిదివరకు చూడని నిర్లిప్తతని గమనించాడు. పడకగదిలో. పగటిపూట పనిపాటల్లో గడపివేసిన నిశవేళల్లోతనలో చెలరేగే తీవ్ర మథనానికి తట్టుకోలేక క్రిందమీదయ్యేది. రవిగూడానిర్లిప్తంగా ఆమె మానాన ఆమెను వదలివేశాడు. ఎక్కువకాలం ఆమె ఎదురుగా వుండకుండా బయటవ్యాపకాలు పెంచుకున్నాడు, కాలేజీలోఫంక్షన్లు కండక్టుచెయ్యడం, క్లబ్, సినిమాలు, స్నేహాలు వీటితో కాలంగడిపి రాత్రిపూటలో ఏపదిగంటలకు

(తరువాయి 21 వ పేజీలో)

## జీవన గవ్యం

(12వ పేజీ తరువాయి)

యింటికొచ్చేవాడు. పన్నెండుదాకమర్నాడు క్లాసులకి ప్రిపేరవుతూ వెళ్ళుచ్చేవాడు. నిద్రవచ్చినప్పుడు వెళ్ళి పడుకునేవాడు. సంధ్య నిర్వికారంగా రవినిచూస్తూ కూర్చునేది. లేకపోతే అతను నిద్రపోయేదాకా ఏ పుస్తకమో చదువుతూ కూర్చునేది. రవి నిద్రపోగానే తానూనిద్రపోతున్నట్లు నటించేది. కానినిజంగా తన మనస్సులో విజృంభించేవిరుద్ధశక్తుల తాకిడికి తల్లడిల్లిపోయేది.

ఒకరోజుఅలానేకూర్చుని నిర్వికారంగా తనవైపుచూస్తున్న సంధ్యమీద రవికి చిరాకేసింది.

''ఎందు కలాగకళ్ళలో వత్తులు వేసికొని కూర్చుంటావు? ఈ మాత్రం ఆరోగ్యం వుండటంగూడా యిష్టంలేదా? వెళ్ళి పడుకోరాదూ!'' అని విసుక్కున్నాడు.

అతని చిరాకుచూసి సంధ్యకు జాలివేసింది.

''నిద్రరావడంలేదు ''

''ఏదైనా చదువుకో''

''చదువు కోబుద్ధేయడంలేదు''

''నీ యిష్టమొచ్చినట్లు చేయ్!'' అన్నాడు కోపంగా.

''ఇలాకూర్చోవడం తప్పంటారా? తప్పంటే వెళ్ళిపడుకుంటాను''

''ఒకరి తప్పొప్పులను నిర్ణయించవలసిన బాధ్యతను నేనెందుకు అనవసరంగా నెత్తిన వేసుకోవాలి.''

''ఇది అనవసరపు బాధ్యత ఎందుకవుతుంది? ఏ విషయంలోనగూడా మీరు నాకంటే వున్నతమైనవారు దైహికంగాను, మానసికంగానూ, విజ్ఞానాత్మకంగానూ అభివృద్ధి చెందినవారు నేను కొన్నికొన్ని విషయాలలో సరిగా ఆలోచించలేకపోవచ్చు. పొరబాటు పడవచ్చుగూడా. సరిదిద్దవలసిన బాధ్యత మీకుకాకపోతే మరెవరికి?''

''నిజమే! కాని అలాంటిపొరపాటెక్కడ తగిన సమయమూ బోధించవలసిన విషయమూ గాదిది. ఎవరికి వారుగా విచక్షించుకొని నిర్ణయించుకోవడం మంచిదిగాని అందులో మరొకరి ప్రమేయం కలిగిందంటే వారికి ప్రలోభం, వ్యామోహం, స్వార్థం, క్రూరత్వం, అంటుగంటు బడవచ్చు. పది కాలాలపాటు కలసి బ్రతకవలసిన యిరువురిలో ఒకరికి మరొకరిపట్ల అలాంటి అభిప్రాయాలే కలిగితే అనూహ్యమైన మలుపుల్లోకి వారిబ్రతుకులు మళ్ళిపోతాయి. ఇక వారు పరిస్థితులకి బానిసలేకాని తమ జీవితాల్ని తమభావానికి అనుగుణంగా దిద్దించుకోలేరు. మనిద్దరం కలసివుండడం కుదరనప్పుడు విడిపోదాం కాని జీవితంలో అలాంటి స్థితిని నేను కోరుకోలేను.'' అన్నాడు రవి.

ఆరోజు రవి భోజనమునేసి కాలేజీకి వెళ్ళడానికి తయారవుతున్నాడు. సంధ్య బట్టలందిస్తూ ''ఇవ్వాళ అత్తయ్య సినిమాకు వెళ్దామంటుంది '' అంది

''అలాగే వెళ్ళరండి'' రవి

ఒకక్షణం ఆగి ''అలాకాదు అందరం కలసే వెళదామంటున్నది,'' అంది సంధ్య

''నాకెలా వీలుపడుతుంది? కాలేజిఅవగానే అసోసియేషన్ మీటింగ్ వుంది. నేను సినిమా వేళకుఅందుకోలేను మీరువెళ్ళండి'' అన్నాడురవి. సంధ్య మౌనంవహించింది.

క్రిందికి వస్తూంటే తల్లికేకవేసింది వంటింటిగుమ్మంలో నిలబడ్డాడు రవి.

''ఒరేయ్‌రవీ! పెందరాళేరారా ఇంటికి యివ్వాళ సినిమాకు వెళ్దాం'' అంది

''నాకు వీలుపడదమ్మా. కాలేజి వదలిపెట్టినతర్వాత మీటింగ్‌వుంది నీవూ సంధ్య వెళ్ళరండి '' అన్నాడు రవి.

''ఒరేయ్! రవీ యిటుచూడు. పెళ్ళికాకముందే నయం. ఏడు ఎనిమిదింటికి యింటికి చేరుకునేవాడివి కోడలుకొత్తగా కాపురానికి వచ్చిందిగదా! నీవు యిలా పొద్దుపోయి పదిగంటలకో, పదకొండు గంటలకో యింటికివస్తూంటే ఆపిల్లఏమనుకుంటుంది? ఇంకాఅది ఓర్పు గలపిల్లగనుక సరిపోయింది నీ వరస నాకేమీ నచ్చలేదు రవీ''

''ఇందులో ఏమనుకోవడానికి ఏముందమ్మా నిజంగా నాకు పనున్నాయి. సినిమాకు మీరిద్దరు పోయిరండి'' అంటూ బయటకెళ్ళిపోయాడు.

క్రిందికి దిగివస్తూ తల్లీ కొడుకుల సంభాషణవిని మెట్లమీదే నిర్విణ్ణురాలై నిలబడిపోయింది సంధ్య

ఎలాగూ సినిమాకు వెళ్ళివుంటారుగదా మర్నాడు క్లాసులకు పెందరాళే ప్రిపేరవుదామని కాలేజీ వదలగానే యింటికివచ్చిన రవి సంధ్యనొక్కదాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. సంధ్య కాఫీకలిపి తీసుకొచ్చింది. కాఫీ తీసుకుంటూ,

''ఏం సంధ్యా! నీవుఅమ్మతో సినిమాకి వెళ్ళలేదేం?'' అన్నాడు.

''కాలేజీలో మీటింగుందని మీరప్పుడే వచ్చేశారేం?''

''ప్రశ్నకు ప్రశ్న సమాధానంకాదు.''

''అవును మీప్రశ్నకు సమాధానంలేదు, నాప్రశ్నకి సమాధానంరాదు''

''అదేంలేదు, నిజంచెప్పి నిన్ను యిరుకున పెట్టడం నాకిష్టంలేదు''

అయితే మీరమ్మతో చెప్పినవన్నీ అబద్ధాలేనా?''

''అన్నీ అబద్ధాలుకావు. అబద్ధమేదో నీకు తెలిసే వుంటుంది'' అంటూ పైకి వెళ్ళిపోయాడు.

''అయితే మీరు కావాలనే వ్యాపకాలు పెట్టుకొని పొద్దుపోయిందాకా బయట తిరుగుతున్నారన్నమాట'' అన్న సంధ్య మాటలు గొంతుకలోనే కొట్టుకలాడినై. తాను వెనకనే పైకి వెళ్ళింది బట్టలు మార్చుకుని టేబుల్‌ముందు కూర్చుంటూ సంధ్య రావటంచూసి ''సంధ్యా! పోనీ అమ్మతో సినిమాకైనా వెళ్ళకపోయావా? కొంతసేపైనా మనస్సును మళ్ళించి వుల్లాసంగా గడపవచ్చుగదా!''

"అలాగని గ్యారంటీ యేముంది?"

"అయితే నేను వచ్చినా ఏదోనెపంమీద మానివేసేదానివేగా?"

"ఏ మో బ హు శా సి ని మా కే వచ్చేదాన్నేమో!"

"నేను అలా అనుకోలేదు"

"ఎలా అనుకున్నా ఫరవాలేదు. మిగిలి పోయిందేమీ లేదు." అంది సంధ్య.

"మీరిప్పటికే నేను వూహించనంతటి సానుభూతిని అయాచితంగా అందజేశారు. ఎప్పుడూ భగవంతునికంటే ముందుగా మీయీ మంచితనాన్నే స్మరించుకుంటాను నేను బ్రతికినంతకాలము" అని అనుకుంది మనసులో.

"అయితే మరొక సినిమా ప్రోగ్రాం గూడా యిప్పుడే నిర్ణయమైపోయిందన్న మాట. కాని సంధ్యా! యీసారి మాత్రం మన ఆటలుసాగవు. మా అమ్మ తప్పకుండ మన అటకట్టిస్తుంది." సంధ్య పెదాలమీద స్వాభావికమైన చిరునవ్వుని మొదటిసారిగా చూశాడు రవి. అతని వూహాంచలాల్లో కాంతిరేఖలు తళుక్కుమన్నాయి.

"ఇంతచక్కగా అబద్ధాలాడేమీరుండగా నాకలా అనిపించడంలేదు"

"నేను ముమ్మూర్తులా మా అమ్మపోలిక ఏదో సాగనిస్తుందిగాని ఆమెముందు నా ఆటలేం సాగుతాయ్ మరోసంగతి. అను మానం కల్గిందో అవులించమని బ్రతిమ లాడి మరీ ప్రేగులు లెక్క పెట్టేస్తుంది"

"మంచిదే! మీరు స్నానంచేద్దురుగాని పదండి. భోంచేసి యేకంగానే చదువుకో వచ్చు."

"అ మ్మ వ చ్చా క తి ం టా లే! తొందరలేదు."

"కాదు నా మాట వినండి" ఎంతో గంభీరంగా వినవచ్చేసరికి తలెత్తి చూశాడు రవి. ఆమె దీనమైన చూపుల్ని ఎదుర్కో లేక తలవంచుకున్నాడు. త్రోసివేయలేక స్నానానికి క్రిందికి వెళ్ళాడు రవి.

భోజనం వడ్డించి ప్రక్కనే కూర్చుంది సంధ్య. ఆ సమయంలో ఆమె మనస్సు పరిపరి విధాలపోతోంది. తన జీవితాన్ని సింహావలోకనం చేసుకుంటోంది. జ్ఞాపకాల తాకిడి తీవ్రంగావుంది. వాటిని మనస్సు నుంచి సమూలంగా పెరికివేయాలని ప్రయ త్నిస్తూంది.

"మ జ్జి గ"

మారుఅన్నం వడ్డించి మజ్జిగ పోసింది.

ర వి భోంచేస్తున్నాడు……… ………. అనుకోకుండా స ం ధ్య అతని కంచంలో చేయిపెట్టింది....

"ఏ మి టి స ం ధ్యా! ఏమయింది?" అన్నాడు రవి.

"నాకులేకుండా అంతామీరేతినేస్తారా?"

"నీకు లేకుండా అం తా తి నే య డ మేమిటి?"

"ఒక్క ముద్ద పెట్టండి" చేయి చాచి దీనంగా చూసింది సంధ్య

రవికళ్ళలో నీళ్ళురాబోయి ఆగినై.

స ం ధ్య కోర్కె నెరవేర్చకపోవడం చేతగాలేదు రవికి భోజనం ముగించి రవి పైకెళ్ళిపోయాడు. పక్కెంకడిగివేసి హాల్లో సోఫాలో చేరబడింది సంధ్య. ఆమెముందు గతమంతా ఒక్కసారి మెదిలింది

తమయింటికి నాలుగిళ్ళ అవతలవున్న రాజశేఖరంగారబ్బాయి విశ్వంమీద మోజు పడింది తను. ఈ విషయం ఎవ్వరికీ తెలి యనివ్వలేదు. అతనిచెల్లెలు సరళ తన స్నేహితురాలు. ఆ చనువువల్ల తమరెండు కుటుంబాల మధ్యా బాగా స్నేహం వుండేది. విశ్వం తనమనస్సులో బాగా అల్లుకు పోయాడు. కాని తమ వివాహానికి రెండు కుటుంబాలూ అంగీకరించవు. ఒకవిధంగా చూస్తే యీ విషయంలో నిరాశే చేసుకుంది తను. వాళ్ళు తమ కులస్థులుగాదు అనే శంలో, ఆదర్శపు వ్యామోహంలో కుల మతభేదాల్ని. వర్గతారతమ్యాల్ని తూల నాడినా సమాజం వాటికిచ్చే విలువ యిస్తూ నేవుంది. సమాజంలోని అనేక విషయాలకీ జీవితంలో ఎదురయ్యే అనేక మలుపులకీ యివి కారణాలవుతూనే వున్నాయి. వీటిని అధిగమించేశక్తి మాటలకేగాని చేతలకింకా అలవడడంలేదు. తనకి సమాజంనుంచి, సమాజజీవులైన తన తలిదండ్రులనుంచి విడివడి బ్రతుకును సాగించేపాటి అవ కాశంగానీ, తీవ్రతగానీ లేవు. ఈద్వంద్వ ఘర్షణలో తానొక నిర్ణయానికిరాకపూర్వమే తన కళ్ళఎదుటే అన్నీ జరిగిపోయినై. తను రవికి భార్యఅయింది. కానీ తన మనస్సులోనుంచి విశ్వాన్ని త్రోసివేయలేక పోతోంది ప్రయోజనంలేదని తెలిసీ యీ వ్యాకులత యెందుకో అంతుబట్టదు తన మట్టుకు తనకి వివాహం అయిపోయింది. ఎలాగూ జరిగేదే అది అయితే అది రవితో జరగడం తనజీవితంలో పెద్ద అదృష్టం, తన జీవితమే వున్నతమై పోయింది, సామాన్యంగా భర్త భార్యపట్ల ప్రవర్తించే విధంగానే ప్రవర్తించివుంటే తానేమీ అభ్యంతరపెట్టడానికి అవకాశం లేదు. అభ్యంతరపెడితే తనస్వార్థంకోసం భర్తకి ద్రోహం చేయడమే అవుతుంది తనమనస్థితి ఎలాగుంటుందీ తెల్పుకోవడం శోభనంనాటి వుద్రిక్తపరిస్థితులో అతనికి అంత సులభంగాదు, విశ్వంమీదనుంచి మనస్సుని మళ్ళించుకోలేక బాధపడుతున్న తను అనాటి వుద్రిక్తపరిస్థితుల్లో యేపరి ణామానికి గురవుతుందో ఏవ్యథాభరితమైన మలుపుల్లోకి తనజీవితం తిరిగిపోతుందో ననిభయపడింది తను. ఆరాత్రి.... కాని.... రవి తనమనస్సుని విప్పి చదువుకున్నట్లు ప్రవర్తించాడు. నేర్పుగలవాళ్ళకి యితరుల మనస్సు తెలుసుకోవడంసాధ్యమేకావచ్చు. కాని అలాప్రవర్తించడం సామాన్యంగా జరగని విషయం. అలా ప్రవర్తించడం ఒకవేళ సాధ్యమైనా తన స్థితిపట్ల సాను భూతితో అలా చేయడం ఒక్క తనభర్తకి మాత్రమే చేతనైనపని. ఇంతటి వుదాత్త మైన రవి తనజీవిత భాగస్వామిగా లభిం చాడు తన కన్నెవూహల్లో నిలచిన పురు షుడు. వివాహధర్మం చేతనేకాకుండా తన ఉదాత్తత సానుభూతిగూడి తాను ఉద్రే కాన్ని అణచివేసుకోగల శక్తిచేతగూడా

తన కన్నుల్లో మెదుల్తున్న భర్త- వీరి రువురూ తన మనస్సుమీద అధికారం కోసం నిర్విరామంగా పోరాడుతుంటే ఆ దావాగ్ని జ్వాలలకి తాను వేగిపోతోంది. ఇలా ఎంతకాలం? తనకి జీవితంలో మిగిలిన మార్గం ఒక్కటే. అది తన భర్త ఆశల్ని పండించడం. దీనిలో అసంభావ్య మైన దేదీ లేదు. ఇంతవరకు రవి ప్రద ర్శించిన నేర్పు నిగ్రహం అనూహ్యం. అదీ తన ప్రేమకు అభాసుపాలు గాకుండా వుండేందుకు. అతనుమటుకు ఎంతకాలం యిలా నిలద్రొక్కుకోగలడు? విసుగెత్తిన అతని మనస్సు విరిగిపోతే? పతనమయ్యే టప్పటి మహావేగంతో అతని వాంఛలు తోక త్రొక్కిన త్రాచుల్లాగా అతనిమీదకే పడగ విసిరితే జరుగబోయే జీవన వైఫ ల్యానికి నేను కారణంగాదని బుకాయిం చినా తన మనస్సు తనని శపించదూ? తనుమాత్రం వృథాఊహల్తో తన ధర్మా న్నుండి జారిపోతూ అంతటి సంస్కార వంతుని జీవితం కంటకప్రాయం చేయడం భావ్యమా?" ఆమె చెక్కిళ్ళమీద కన్నీళ్ళు చారికలు కట్టినవి "ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ఇంకా ఆలస్యం చేయ డం అవివేకం- అన్యాయం" ఈ మాటల్తో కళ్ళలో మెదులుతున్న భర్తని హృదయం లోకి చేరదీసికొని కన్నీటితో అభిషేకిం చింది. ఆమె కన్నె వూహల్లోని విశ్వం ఆమె వైవాహిక దీక్షముందు- వివేచన ముందు మోకరిల్లి తొలగిపోయాడు. పైకి వెళ్ళాలని ఒక్క వూపుతో మెట్లదగ్గరకెళ్ళిన సంధ్య వీధి తలుపుచప్పుడుకి ఆగిపో యింది. తిరిగివచ్చి తలుపు తీసింది. ఎదురుగుండా అత్తగారు హాల్లోకి వచ్చాక కోడలు ముఖంచూసి "అయితే నన్ను సినిమాకి పంపి నీ వొక్కదానివీ యింట్లో కూర్చుని ఏడుస్తున్నావంటే" అంది

"ఒక్కదాన్ని కూర్చోలేదు మీ అబ్బాయి వచ్చారు. భోంచేసి పైన చదువు కుంటున్నారు."

"ఓహో, అలాగా!! అయితే యీ ముసిల్ది యింత తొందరగా వూడిపడిందే మని ఏడుస్తున్నావేమిటే?" అంది నవ్వుతూ

కోపంతో కళ్ళెత్తిన సంధ్య అత్తగారి ముఖంచూసి జారిపోయింది.

"ఛా! అవేం మాటలత్తయ్యా! నే నలాంటి దాన్నా?"

'కాదనుకో! మరి రవేమన్నా అన్నాడా?'

'మీరు మరీనత్తయ్యా! ఆయన నన్నెం దుకు కోపగించుకుంటారు?"

"మరి నువ్వెందుకేడుస్తున్నట్లు?" గద్దించే అడిగింది.

సంధ్యకి తప్పుకొనేందుకు మార్గం దొరకలేదు. గాభరాపడిపోయింది. సమా ధానం చెప్పాలి తను. చటుక్కున అబద్ధ మాడేసింది.

"ఆకలవుతోంద"ని

అత్త బుగ్గలు నొక్కుకుంటూ "ఓసి నీ యిల్లు బంగారంగానూ! ఆకలయిన దానివి అన్నం తినక ఏడుస్తూ కూర్చుంటే ఆకలి తీరుతుందే? అయినా వాడికి పెట్టిన దానివి నీవూ తినక ఏకాదశీ వుపోషాలు చేసే యీ ముసిల్దానికోసం ఎదురుచూస్తూ కూర్చున్నావా? నీవు ఎంత కైనా తగిన దానివేనే సంధ్యా" అంది.

"అది కాదత్తయ్యా! యిక్కడికి వచ్చి నప్పటినుంచీ యిద్దరం ఒక్కసారే భోం చేయడం అలవాటైపోయింది. ఒక్క దాన్ని కూర్చుంటే సహించదు. మరేం జేయను?"

అత్తముఖంలో ఎంతో తృప్తికన్పించింది అయినా తన సహజధోరణిలో అనేసింది.

"ఇదుగోనమ్మా! నీవు నాకు కూతురులేని లోటు తీరిస్తేతీర్చావుగాని యిలా ఆకలి ముఖంతో కూర్చుంటేమటుకు నేను సహిం చేదిలేదు. తర్వాత నన్ను యేమనుకొని యేమీ ప్రయోజనముండదు.

గబ గబా నాలుగు మెతుకులు నంజి లేపబోయింది సంధ్య.

"కూర్చో! ఆకలయి ఏడ్చినదానివి యీ సంజాకోపడమేమిటే? సరిగ్గా తిను" అని గద్దించింది. విధిలేక కంచంఅన్నం తిని "నాకు నిద్రవస్తూందత్తయ్యా! నేను వెడుతున్నాను." అంటూ పరుగెత్తినట్లు నడచింది పైకి. రవి యింకా టేబుల్ లైటు ముందు చదువుకుంటూనేవున్నాడు. సరాసరి వెళ్ళి లైట్ తీసివేయబోయింది.

ఈ హఠాత్పరిణామం అర్థంకాని రవి "అదేమిటి సంధ్యా! ఇంకా ప్రిపేరవ వలసినది బోలెడుంది" అన్నాడు.

"అబద్ధం"

"నిజమేననుకో"

"ఇలా రోజూ పొద్దుపోయిందాకా మేలుకొంటే ఆరోగ్యం పాడవదూ?"

"చూడుసంధ్యా! యివ్వాళ నేనొక నిర్ణయానికి వచ్చాను."

"చెప్పండి! వింటాను."

"జీవితంలో మనంవేసే ప్రతిఅడుగూ చేసేప్రతిపనీ సరియైనదేనని చెప్పలేము. జీవితానికి అదికల్పించే ప్రయోజనాన్నిబట్టి ఆప్రయోజనానికి సమాజంలో లభించగల



సభ్యతలనిబట్టి వాటి మంచీ - చెడులు నిర్ణ యింకావలసి వుంటుంది. పొరబాటుపని చేసి పొరబాటని తెలిసినతర్వాతగూడా తను చేసినపనికి లాభదాయకమైనప్రయోజనాన్ని పొందాలనుకోడం అనేక కారణాలవల్ల నేను హర్షించలేని విషయాల్లో ఒకటి. ఒక సామాజిక సాంప్రదాయానికీ, కుటుంబిక మైన మర్యాదకీ లోబడి మీ యిష్టానిష్టాలు తెలుసుకోకుండా పెళ్ళాడాను. దాని కారణంగా మీమీదికేమైనా వత్తిడి వచ్చి వుండవచ్చు. దీన్ని యింకా యిలా సాగనివ్వదలచుకోలేదు డైవోర్సుకి ప్రయత్నిద్దామనుకుంటున్నాను.

సంధ్య నవ్వేరవోయింది. పది నిమిషాలు గడచిపోయినాయి.

"సంధ్యా"

"యింకా ఏమన్నావున్నా విప్పంకోచంగా చెప్పండి. సిద్ధంగా వున్నాను."

"చెప్పవలసింది చెప్పేశాను. నీ వుద్దేశ్యాన్ని అడుగుతున్నాను."

"అంటే అంగీకారమన్న మాటేనా?"

"ఇంచుమించుగా అంతే"

"డైవోర్సు మీరెందుకు కోరుకుంటున్నారు? మరో వివాహం చేసుకోవడం కోసమేనా?"

"అలాగే అనుకో"

"డైవోర్సుతోనిమిత్తంలేకుండా మరో వివాహం చేసుకోడానికి వీలుంటే?"

"ఉండొచ్చు కాని డైవోర్సు ప్రస్తావనేలేకపోతే మరోవివాహంయొక్క అవసరం కలిగియుండేదికాదు"

"మీ నిర్ణయం మీది. నా నిర్ణయం ఇది మీరు మరోవివాహం చేసుకోడానికి అంగీకరిస్తున్నాను. డైవోర్సుకి నేనంగీకరించడంలేదు"

"నీ వుద్దేశ్యం నాకర్థంగావడంలేదు.

"నేను మీ ఆశల్ని పండించలేదు. ఇది పూర్తిగా నా నేరమే. మీరు మరోభార్య ద్వారా సుఖపడగోరితే అభ్యంతరపెట్టేపాటి యోగ్యతనుగూడా నేను సంపాదించుకొనివుండలేదు. కాని ఒకసారి మీభార్యనై తిరిగి విడిపోయి అలాకాకుండా పోగల్గడం నేను సంభావించలేని స్థితి. యిది మృత్యువు తర్వాత మాత్రమే సంభవిస్తే సంభవించవచ్చు.

ఈసారి నివ్వెరపోవడం రవివంతైంది

"జీవితంపట్ల నీకున్న అభిప్రాయం యిది. అయితే శారీరకవాంఛలపట్ల నీ దృక్పథం ఏమిటి?"

"ఏముంటుంది వేరే. ఇదీ మీదగ్గర నేర్చుకున్నాను.

"నాదగ్గరా?"

"ఆ వాంఛలయొక్క తీవ్రత ఎంతటిదైనాగానీయ్ మనో నిర్ణయానికి లోబడవలసిందేనని. దీన్నే అభ్యసిస్తాను. ఇందులోనూ గురుపీఠం మీదే."

"వింటానికి బాగానేవుంది. కాని ఏ సుఖాన్నికోరి ఇంతటి త్యాగానికి ఒడిగడుతున్నావ్ సంధ్యా?"

ఇంతసేపటినుండీ గంభీరంగావున్న ఆమె ముఖాన్ని దుఃఖం ముంచెత్తింది. అది కట్టలకి గండికొట్టి కళ్ళలోగుండా ఉబికి వచ్చింది.

రవి చేయి ప్రేరణ లేకండానే ఆమె కన్నీళ్ళని తుడిచింది.

"నీవు యింత కష్టపడవలసిన అవసరం వుందనే అనుకుంటున్నావా? మరో వివాహంవద్దని ఒక్కమాట యెందుకని చెప్పలేవు సంధ్యా?

"ఒకసారి మీరే చెప్పారు" ఇలాంటివి ఒకరి చొరవకీ, బోధకీ తగిన విషయాలు కావని. ఒకవేళ అలా చొరవ తీసికొని బోధించసాగితే నేను ప్రలోభినిని, వ్యామోహితనీ. స్వార్థపరురాలనీ అవవలసి రావచ్చు మీ దృష్టిలో. నా పట్ల ఎవరికైనా అలాంటి అభిప్రాయం గల్గడం నేనూ సహించలేను. అందుకు అవసరమైతే భార్యగా పొందవలసిన సుఖాల్ని వదలుకొంటాను"

"నా పాఠం నాకు వప్పజెప్పేదానివయ్యావన్నమాట!"

సంధ్య పమిట చెంగు భుజంమీదుగా లాక్కొని భర్త పాదాల దగ్గర వంగి నమస్కరించి అంది. "క్షమించండి. మీ పాఠానికి ఎదురు పాఠం చెప్పవలసి వస్తుందేమోనని అనుకున్నాను. కాని మీ పాఠమే సరియైనదని అనిపించింది. మీ పాఠంతప్ప మరే పాఠం వప్పజెప్పే యిచ్ఛగానీ, శక్తిగానీ నాకు లేదు. ఇదే సంస్కృతి. సభ్యత. భార్యగా నాయోగ్యత అని విశ్వసిస్తున్నాను

"అయితే నేను డైవోర్సుకి ప్రయత్నించ వీలులేదన్నమాటే!"

పెదాలు బిగించినా ముఖమంతా నవ్వే అయిపోయింది రవికి.

"ఏమో! నాకేం తెలుసు!! క్రిందికి వెళ్ళి మీ అమ్మతో చెబుదురుగాని రండి!" అంది సంధ్య రవి చేతిని పట్టుకుని.

—::—


## శ్రీ యోగాశ్రమము

### పెదవాల్తేరు

విశాఖపట్టణము - 3

డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానము లేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

వివరములు తెలియగోరువారు ఒక రూపాయి పంపవలయును.